

## అన్నాచెల్లెళ్ల కళ్లల్లో వెలుగులు

తల్లిదండ్రులు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్లకు దాతలు పెద్ద ఎత్తునా సాయం చేస్తున్నారు. దీంతో వారి కళ్లలో వెలుగులు కనిపిస్తున్నాయి.

8లో▸



## మళ్లీ పులులొచ్చాయ్

ఆదిలాబాద్ జిల్లాలో మళ్లీ పులుల సంచారం గుబులు రేపుతోంది. భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి రోడ్డుపై నాలుగు పులులు కనిపించాయి.

10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 / 16.7

## వాతావరణం

వాతావరణం పొడిగా, ఎండగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది. పగలు వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. తెల్లవారుజామున చల్లగా అనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### మంత్రిని కలిసిన రిటైర్డ్ డీజీపీ



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో తేజ్ దీప్ కౌర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రిటైర్డ్ డీజీపీ తేజ్‌దీప్‌కౌర్ మినస్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఖడ్గం, శాలువా, పూలమాలతో సత్కరించారు.

### ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరశురాం

మామడ: మండల కేంద్రంలోని ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో పరశురాం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో వసతులను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఈసీ సభ్యుడు తుకారాం, రవికిరణ్, ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్ ఉన్నారు.

### శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూవో లత

లక్ష్మణచాంద: జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను ఎస్సీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో లత సూచించారు. ఎంఎం డిఫెన్స్ అకాడమీ, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను శుక్రవారం పరిశీలించారు. హిస్టరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ గ్రూపు 2, 3, 4 పరీక్షల కోసం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని వారు నేరుగా అకాడమీ నిర్వాహకుడు రాజేశ్వర్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్, రోజుకు రూ.75 చొప్పున స్టైఫండ్ అందిస్తామని తెలిపారు. వివరాలకు 9948861942, 9490936143 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### 26న గ్రహణం మొర్రి ఉచిత వైద్య శిబిరం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 26న గ్రహణం మొర్రి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సాక్ష్యం స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు తెలిపారు. ప్రియదర్శిని నగర్ కాలనీలోని సాక్ష్యం కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. పుట్టుకతో పిల్లలలో వచ్చే పెదవి అంగిలి, చీలిక వ్యాధులకు శిబిరంలో చికిత్స చేయనున్నట్లు వివరించారు. వివరాలకు 9849734031 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

నిర్మల్ చైన్‌గేట్: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. తన చాంబర్‌లో యాసంగి పంట కొనుగోళ్లకు సంబంధించి సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు కావాల్సిన గోనె సంచులు, గిడ్డంగులు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు సమకూర్చాలని తెలిపారు.

# సేవాలాల్ మార్గం ఆదర్శనీయం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా సేవాలాల్ 284వ జయంతి వేడుకలు



సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మంత్రి, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న రేఖానాయక్, విజయలక్ష్మి



నృత్యం చేస్తున్న మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు



నృత్యం చేసుకుంటూ వేడుకలకు వస్తున్న మహిళలు

వేడుకల్లో సెల్ఫీ దిగుతున్న చిన్నారి

నిర్మల్‌టౌన్: బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆదర్శనీయమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అంతకుముందు బంజారాల సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి దివ్యనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ తన బోధనలతో బంజారా జాతి పురోగమించడానికి కృషి చేశారని తెలిపారు. తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడని అన్నారు. సేవాలాల్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సేవాలాల్ ఆదర్శాలను కొనసాగించేలా గిరిజనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని తెలిపారు. స్వరాష్ట్రంలో గిరిజనులు వికాసం సాధించాలనే గొప్ప సంకల్పంతో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. స్వయం పరిపాలన విధానాన్ని అమలు చేసి గిరిజనులకు రాజ్యాధికారం దక్కేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశంలో ఎక్కడా లేని విధంగా అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మల్‌లో జగదాంబ – సేవాలాల్ మందిరం కోసం రూ.3 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రూ.కోటితో బంజారా భవన్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మాట్లాడుతూ.. బంజారాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి బంజారాలు అండగా నిలవాలని కోరారు. ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, ప్రజాప్రతినిధులు, బంజారా సేవా సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# ఎక్కడి 'ప్లాన్' అక్కడే..!

- ఇప్పట్లో అమలు చేయొద్దని నిర్ణయం
- వ్యతిరేకతల నేపథ్యంలో ఎన్నికలయ్యే వరకూ హోల్డ్



నిర్మల్ మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్

నిర్మల్: మున్సిపాలిటీల్లో ఎక్కడి మాస్టర్‌ప్లాన్ అక్కడే నిలిచిపోయిందా..? ఎన్నికలయ్యే వరకూ ఇదే పరిస్థితి కొనసాగనుందా..? అంటే అధికారవర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలయ్యే వరకు ముసాయిదాలను మూలన పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కామారెడ్డిలో తీవ్ర వ్యతిరేకత రావడం, రైతులు ఆత్మహత్యాయత్నం చేయడం, రాజకీయ పార్టీల ఆందోళనల నేపథ్యంలో అక్కడి మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను రద్దుచేస్తున్నట్లు పాలకవర్గం తీర్మానం చేసింది. ఇదే పరిస్థితి జగిత్యాలలోనూ కనిపించింది. నిర్మల్‌లో కూడా ముసాయిదాపై వందల్లో అభ్యంతరాలు, ప్రజలు, రైతుల నుంచి వ్యతిరేకతలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు మాస్టర్‌ప్లాన్‌ను ముట్టుకునే పరిస్థితి లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి.

**రైతుల ఆందోళన..**

తమ భూముల్లో నుంచి అవసరానికి మించి రోడ్లు వెళ్తున్నాయని, తమ భూములు వేరే జోన్‌లోకి మార్చారని జిల్లాకేంద్రంలో రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక బంగల్‌పేట్, రాంరావ్‌బాగ్, బేస్తవార్‌పేట్, బుధవార్‌పేట్, వెంకటాద్రిపేట్, విశ్వనాథ్‌పేట్‌తోపాటు మంజులాపూర్ గ్రామాలకు చెందిన రైతులు మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను వ్యతిరేకించారు. ఇందులోని ప్రతిపాదనలపై తమకు తీవ్ర అభ్యంతరం ఉందని పేర్కొన్నారు. ఈ డ్రాఫ్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు మంత్రి, కలెక్టర్, మున్సిపల్ చుట్టూ తిరిగారు. రైతులతోపాటు చాలామంది సామాన్యులు సైతం తమ భూములను వేరే జోన్‌లోకి మార్చారంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు.

**మంత్రి ముందే చెప్పారు..**

రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, మాస్టర్‌ప్లాన్ విషయంలో కూడా ఎవరికీ నష్టం జరగకుండా, ఇంచ్ భూమి కూడా కోల్పోకుండా చూస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. తమ భూముల విషయంలో వచ్చిన రైతులకు మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మాస్టర్‌ప్లాన్లను ప్రభుత్వం రద్దు చేస్తుందని వెల్లడించారు. అనంతరం డ్రాఫ్ట్‌పై ఈనెల 10 వరకూ అభ్యంతరాలు స్వీకరించినప్పటికీ బృహత్ ప్రణాళిక మాత్రం ఇప్పట్లో ముందుకు వెళ్లదన్న విషయాన్ని కూడా 'అధికార'వర్గాలు తెలిపాయి.

**మార్పులపైనే ఆందోళన..**

కామారెడ్డి, జగిత్యాలతో పోలిస్తే నిర్మల్ మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ ప్రతిపాదనల్లో పెద్దగా ఇబ్బందులు లేవు. బంగల్‌పేట్–విశ్వనాథ్‌పేట్ మధ్య పంటపొలాల్లో నుంచి వంద ఫీట్ల రోడ్డు, చుట్టూ 200 ఫీట్ల బైపాస్, మంజులాపూర్‌లోని వ్యవసాయ భూములు ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చడంపై ప్రధానంగా ఆందోళన వ్యక్తమైంది. ఇక మంత్రి బంధువులకు అనుకూలంగా మాస్టర్‌ప్లాన్ ఉందని, వారి భూములకు లబ్ధి చేకూరేలా డ్రాఫ్ట్‌లో ప్రతిపాదనలు ఉన్నాయని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నిరసన వ్యక్తంచేశాయి. ఆందోళనలు, నిరసనల నేపథ్యంలో ఈనెల 10 వరకూ అభ్యంతరాల స్వీకరణ కొనసాగించారు. చివరి రెండు మూడు రోజుల్లోనే దాదాపు 200 వరకు అభ్యంతరాలు వచ్చాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

**అభ్యంతరాలు పంపించాం..**

నిర్మల్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌పై నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి రెండునెలలు అభ్యంతరాలను స్వీకరించాం. ఈనెల 10 వరకు మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌పై 591 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని డీటీసీపీకి పంపించాం. ఇప్పటి వరకు అక్కడి నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు, వివరాలు అందలేదు.

– సుమలత, డీటీపీవో

## నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఫోన్‌ఇన్



నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో మాట్లాడేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తుంది. పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడద, వీధి దీపాలు పని చేయకపోవడం, పారిశుధ్య లోపం, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చు.

నిర్మల్ మున్సిపల్ కమిషనర్: సంపత్ కుమార్
సంప్రదించాల్సిన నంబర్: 98499 05888
సమయం: శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

# టోకెన్ల కోసం తంటాలు



గోదాం వద్ద టోకెన్ల కోసం బారులు తీరిన రైతులు

- రాత్రి నుంచే క్యూకట్టిన రైతులు
- అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం
- కేంద్రాన్ని పరిశీలించిన డీఏవో అంజిప్రసాద్

తానూరు : శెనగల కొనుగోలుకు అధికారులు జారీ చేస్తున్న టోకెన్ల కోసం రైతులు తంటాలు పడుతున్నా రు. టోకెన్ ఉన్నవారి నుంచే శెనగలు కొనుగోలు చే స్తుండడంతో రైతులు గంటల తరబడి టోకెన్ కేంద్రా ల వద్ద క్యూ కడుతున్నారు. తానూరు వ్యవసాయ గోదాంలో శుక్రవారం నుంచి శెనగ కొనుగోళ్ల కోసం టోకెన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు గురువారం రాత్రి నుంచే గోదాం వద్ద క్యూ కట్టారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు అధికారులు వచ్చి టోకెన్ల పంపిణీ ప్రారంభించారు. 33 గ్రామాల రైతులు రావడంతో టోకెన్ల కేంద్రం వద్ద భారీ సంఖ్యలో రైతులు బారులు తీరారు. మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినా తోపులాట జరిగింది. దీంతో పోలీసులు కేంద్రం వద్ద చేరుకుని రైతులను క్యూలో ఉంచేందుకు యత్నించారు. ఈ క్రమంలో రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము రాత్రి నుంచే బారులు తీరామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ టోకెన్ల పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. టోకెన్ల పంపిణీ కేంద్రాలు పెంచాలని సూచించారు. కొంత మంది రైతులు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 33 గ్రామాల రైతులకు మూడు కేంద్రాలు ఏం సరిపోతాయని నిలదీశారు.

**85 వేల క్వింటాళ్ల కొనుగోలుకు అనుమతి..**

ఇదిలా ఉంటే జిల్లాలో ఈ ఏడాది 85 వేల క్వింటాళ్ల శెనగల కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని డీఏవో అంజిప్రసాద్ తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. దాదాపుగా రైతులందరి నుంచి పంట కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు దళారులకు అమ్ముకోవద్దని, టోకెన్ల కోసం గొడవ పడొద్దని తెలిపారు. మార్కెట్‌లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

**క్యూలో విద్యార్థులు ...**

శుక్రవారం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో రైతులు తమ పిల్లలను టోకెన్ల కోసం పంపించారు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లారు. దీంతో క్యూలైన్లలో రైతులతోపాటు పిల్లలు కూడా ఎక్కువ మంది కనిపించారు.



టోకెన్ల కోసం క్యూలో విద్యార్థులు



పోలీసులతో రైతుల వాగ్వాదం

# గడువులోగా పనులు పూర్తిచేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్



మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

- సీఎస్ శాంతికుమారి

లక్ష్మణచాంద: ప్రభుత్వ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, జీవో 58, 59, 76 ప్రకారం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, పోడు భూములు, ఆయిల్‌పామ్ సాగుపై చర్చించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, ఆబాది గ్రామ కంఠం, శిఖం, ఫక్ఫ్, దేవాదాయ భూముల వివరాలు ప్రొఫార్మా 1 ప్రకారం సేకరించామని తెలిపారు. సదరు భూమి క్రమబద్ధీకరణ చేసేందుకు అవకాశం, ప్రాతిపదిక, అనుసరించాల్సిన విధానంపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్లకు సూచించారు. జీవో 58, 59 ప్రకారంహోల్డ్‌లో పెట్టిన దరఖాస్తులు మరోసారి పరిశీలించాలని తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు అభినందించారు. క్వాలిటీ కంట్రోల్ బృందాలు కంటి వెలుగు శిబిరాలను సందర్శించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. పట్టణాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. పోడు భూముల పంపిణీకి సంబంధించి జిల్లాస్థాయి కమిటీల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఆమోదించి పోడు పట్టా వివరాలను డౌన్‌లోడ్ చేసి ఒకసారి సరిచూసుకుని పట్టా పాస్ పుస్తకాలు ముద్రణ చేయాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్ లక్ష్యాలను మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. తెలంగాణకు హరితహారం కింద వచ్చే సీజన్‌లో నాటే మొక్కలను నర్సరీలో సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గడువులోగా లక్ష్యాలను పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఎస్‌వో శ్రీనివాస్, డీటీడబ్ల్యూవో సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నేరడిగొండ: తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నేరడిగొండ నుంచి కుంటాల జలపాతానికి వెళ్లే రహదారిలో సవర్గాం వద్ద రూ.3.30 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెనకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఎనిమిదేళ్లలో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, జెడ్పీటీసీ అనిల్‌జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ వెంకటరమణ, బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు భోజన్న, నారాయణ సింగ్, భీంరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మహేందర్, కరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు**

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యే బాపూరావ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తు మృతిచెందిన గ్రామానికి చెందిన జాదవ్ సర్దార్ కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేశారు.

## 'డబుల్ బెడ్రూం' లబ్ధిదారుల ఎంపికకు నేడు వార్డు సభలు

భైంసాటౌన్: భైంసా పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు ఆర్డీవో రవికుమార్ తెలిపారు. శనివారం వార్డుల వారీగా సభలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డు అధికారులను నియమిస్తూ జాబితా విడుదల చేశారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వార్డుసభల్లో లబ్ధిదారుల జాబితా ప్రచురణతోపాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్ టీపీ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా రాంచందర్

ఆదిలాబాద్‌టౌన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా గట్టు రాంచందర్‌రావును నియమిస్తూ వైఎస్ ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల రెడ్డి తెలిపారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. అదే విధంగా వైఎస్సార్ పార్టీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్న బెజ్జంకి అనిల్‌కుమార్‌ను మెదక్ జిల్లా పరిశీలకులుగా నియమించారు.

### ఆలయ నమూనాను పరిశీలించిన మంత్రి



ఆలయ నమూనా పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, ఆలయ అధికారులు

భైంసా: బాసర ఆలయ పునర్నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శృంగేరి పీఠాధిపతుల సూచనలు, సలహాలతో రూపొందించిన ఆలయ నమూనాను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అలాగే ఆలయ అధికారులు, అర్చకులు కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిసి ఆలయ నమూనాపై చర్చించారు.

### వైన్ షాప్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లిలోని శివగంగ వైన్స్‌లో గురువారం అర్ధరాత్రి 2.15 గంటల సమయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి వైన్స్ షాపు వెనుక వైపు నుంచి రేకుల షెడ్డు పైకప్పు తొలగించి లోనికి వెళ్లాడు. కౌంటర్‌లోని రూ.6వేల నగదును దోచుకెళ్లాడు. వైన్స్‌షాప్ యజమాని కుంటాల రమేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలో రికార్డు అయినప్పటికీ స్పష్టంగా కనిపించడం లేదని పోలీసులు తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో పేకాటాడుతున్న పలువురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. ఆదర్శనగర్ కాలనీలోని ఓ ఇంట్లో ముగ్గురు పేకాటాడుతుండగా పక్కా సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని పట్టుకున్నారు. అనంతరం వారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఓలాలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన వస్తువులతో బాధితుడు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం గంగుల ముత్తన్న ఇంటిలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఫ్రిజ్‌లో మంటలు చెలరేగి ఇంటిలోని విలువైన వస్తువులు కాలిపోయాయి. గ్రామస్తులు, భైంసా అగ్నిమాపక అధికారి చరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూ.లక్షా 50వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.



# తర్నం వాగులోంచి తాత్కాలిక దారి



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు

- చిన్న వాహనాలకు అనుమతి
- ప్రయాణికులకు కొంత ఊరట

జైనథ్: మండలంలోని తరోడ బ్రిడ్జి ఈ నెల 19న కుంగిపోవడంతో అప్పటి నుంచి ఈ రహదారి గుండా రాకపోకలు నిలిచిపోయాయి. మొదట్లో బైక్‌లు, పాదచారులను బ్రిడ్జి పై నుంచి అనుమతించారు. బ్రిడ్జి పరిస్థితిని చూసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రాకపోకలను పూర్తిగా నిషేధించారు. బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా గోడలు నిర్మించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. జైనథ్, బేల మీదుగా మహారాష్ట్రను ఆదిలాబాద్‌కు కలిపే ఈ రోడ్డు తరోడ వద్ద రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు నిరాల, అడ, లాండ సాంగ్వి గ్రామాల గుండా ఆదిలాబాద్‌కు రాకపోకలు చేస్తున్నారు. సింగిల్ రోడ్డు కావడం, గుంతలమయంగా ఉండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తరోడ బ్రిడ్జి కింద నుంచి వాగు మీదుగా తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. బైక్‌లు, ఆటోలు, కార్లను అనమతిస్తుండడంతో కొంత వరకు సామాన్య ప్రజల కష్టాలు తీరినట్లే నని చెప్పొచ్చు. వేసవి కాలం కావడం, వాగులో నీటి ప్రవాహం పెద్దగా లేకపోవడంతో బ్రిడ్జి అందుబాటులోకి వచ్చే వరకూ ఈ రోడ్డు గుండానే రాకపోకలు జరిగే అవకాశం ఉంది. ఏదేమైనప్పటికీ అధికారులు వెంటనే స్పందించి కొత్త బ్రిడ్జిని మంజూరు చేసి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారిలో వెళ్తున్న వాహనాలు

## పొంచి ఉన్న ప్రమాదం...

- నిరాల–లాండ సాంగ్వి సింగిల్ రోడ్డులో ట్రాఫిక్
- తరోడ బ్రిడ్జి మూసివేయడంతో భారీ వాహనాలకు బ్రేక్

జైనథ్: మండలంలోని తరోడ బ్రిడ్జిని మూసివేయడంతో నిరాల–లాండ సాంగ్వి పంచాయతీరాజ్ రోడ్డులో ట్రాఫిక్ పెరిగింది. తరోడ బ్రిడ్జి వెంట ప్రతినిత్యం వందల సంఖ్యలో లారీలు, ఇతర భారీ వాహనాలు మహారాష్ట్ర, ఆదిలాబాద్ నడుమ నడుస్తున్నాయి. ప్రస్తుతం తరోడ బ్రిడ్జిని మూసి వేయడంతో నిరాల–లాండ సాంగ్వి రోడ్డు గుండా రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు ఇరుకుగా, గుంతల మయంగా ఉండడంతో ఒకేసారి రెండు భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీనికి తోడు ఈ రోడ్డు వాహనదారులకు కొత్తది కావడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శుక్రవారం ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు సోయా లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ కంఠ ఎక్స్ రోడ్ సమీపంలో బోల్తాపడింది. రోడ్డు కుడివైపు భారీ గుంత ఉండటంతో ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. అంతరాష్ట్రయ రహదారి గుండా వెళ్లే భారీ ట్రాఫిక్ ఈ చిన్న రోడ్డు గుండా వెళ్లాల్సి రావడంతో, ఈ రోడ్డు గుండా ప్రయాణం అంటేనే జంకుతున్నారు.



కంఠ వద్ద బోల్తా పడిన లారీ

# అన్నాచెల్లెళ్ల కళ్లలో వెలుగులు



దుస్తులు అందిస్తున్న తహసీల్దార్



కూలర్, దుస్తులు అందిస్తున్న యువకులు

- సాయం చేయడానికి ముందుకొస్తున్న దాతలు
- సరుకులు, దుస్తులు, నగదు అందజేత
- వచ్చే నెల నుంచి రేషన్ బియ్యం సైతం

సాక్షి స్పందన

దహెగాం: తల్లిదండ్రులు దూరమై అనాధలుగా మారిన అన్నాచెల్లెళ్ల కళ్లల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. ఆ నలుగురు అన్నాచెల్లెళ్లపై 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే..చెల్లెళ్ల కడుపు నిండేది 'అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పెద్ద ఎత్తున దాతలు ముందుకొచ్చి సాయం చేస్తున్నారు. మూడో రోజు శుక్రవారం సైతం పలువురు దాతలు వారికి నగదుతో పాటు, దుస్తులు, నిత్యావసర సరుకులు, ఓ కూలర్‌ను అందజేశారు.

**రేషన్ బియ్యం అందిస్తాం**

మండలంలోని చౌక గ్రామానికి చెందిన అనాధలైనా సిడాం రాజు, మమత, దీపిక, దివ్యలకు ఏడాదిగా రేషన్ బియ్యం అందడం లేదనే కథనం శుక్రవారం ప్రచురితం కావడంతో తహసీల్దార్ మధుకర్ స్పందించారు. చిన్నారులను స్థానిక తహసీల్ కార్యాలయానికి పిలిపించి వారికి నిత్యావసర సరుకులతో పాటు కార్యాలయ సిబ్బంది కలిసి రూ.5వేల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్నా చిన్నారుల వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ బియ్యానికి దూరమయ్యారని, ఆధార్ కేంద్రానికి పంపించి వేలిముద్రలను అప్‌డేట్ చేయిస్తామన్నారు. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ బియ్యం అందుతాయని తెలిపారు. మమతను దహెగాం కేజీబీవీలో, దీపిక, దివ్యలను కుంటలమానెపల్లి ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామన్నారు. చిన్నారుల తండ్రి సిడాం సత్తయ్య పేరును ఉన్న అరఎకరం భూమిని కుమారుడు సిడాం రాజు పేరున విరాసత్ చేసి ఇస్తామని తెలిపారు.

**దుస్తులు అందజేత..**

మండలంలోని కల్వాడ గ్రామానికి చెందిన యువకులు స్పందించి అనాధ పిల్లలకు దుస్తులు, కూలర్‌ను అందజేశారు. అదే విధంగా మరికొంత మంది కూడా తోచిన సాయం చేస్తామని ముందుకొచ్చారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన వాసవి రైస్‌మిల్లు ఆధ్వర్యంలో వంట సామగ్రి అందజేశారు. మరికొంత మంది దాతలు సాయం చేయడానికి ముందుకొచ్చారు. మంచిర్యాల జిల్లా సామగూడెం గ్రామానికి చెందిన యువ కులు నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో అనాధలైన గిరిజన బిడ్డల కళ్ళల్లో వెలుగులు కనిపిస్తున్నాయి.

# హామీలను విస్మరించిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. నాలుగేళ్లైనా రుణమాఫీ చేయడం లేదని మండిపడ్డారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఇలా ఏ హామీని కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఇప్పటికే కేంద్రం నిధులతో జిల్లా కేంద్రంలో రైల్వే ఫిట్‌లైన్ పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు అమృత్ పథకంలో ప్రత్యేక రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. మండల కేంద్రంలో బీసీ సంఘ భవనానికి ఎంపీ నిధుల నుంచి రూ.5లక్షలు, సాయిబాబా, శివాలయంలో అభివృద్ధి పనుల కోసం రూ.10 లక్షలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ ప్రబారి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి, జిల్లా నాయకులు రత్నాకర్ రెడ్డి, రాజు యాదవ్, రామారావు, మండల అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, నాయకులు రాకేష్ యాదవ్, సుభాష్, నర్సారెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

## బాసరలో భక్తుల సందడి



భైంసా: చదువుల తల్లి బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. గోదావరినదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 683 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేశారు. గోదావరి నది ఒడ్డున సూర్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

# ఫంక్షన్‌హాల్‌లో అగ్ని ప్రమాదం

- తృటిలో తప్పిన ప్రమాదం

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద గల సూర్య గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఇదే ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు ఓ పెళ్లి వేడుక జరగనుండగా పెళ్లివారి బంధువులు, పెళ్లికి సంబంధించిన విందు భోజనాలు వండి పెడుతున్న సమయంలో వంటగది వైపునుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఇంతలోనే అప్రమత్తమైన పెళ్లికి హాజరైన వధూవరుల బంధువులు, ఫంక్షన్‌హాల్ సిబ్బంది హుటాహుటిన మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ఫంక్షన్ హాల్ యజమాని మాత్రం షార్ట్‌సర్క్యూట్ కారణమై ఉంటుందని భావిస్తున్నారు. ఇంకా కొంతమంది వంటచేసే సమయంలో నిప్పురవ్వలు ఎగిసిపడి మండలు చెలరేగాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే పెళ్లి వేడుకలను ఇతర ప్రాంతానికి మార్చారు.



వంటగది నుంచి ఎగిసి పడుతున్న పొగలు

# నేత్రపర్వంగా గోవిందుడి రథోత్సవం

- ముగిసిన శ్రీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

తలమడుగు: మండలంలోని భరంపూర్ గ్రామ సమీపంలోని కొండపైన గల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో, హోమం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరలతో స్వామివారికి హోమం, పూర్ణాహుతి, కల్యాణం, చక్రస్నానం గావించారు. ఉదయం నుంచి సాయత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**ఘనంగా రథోత్సవం..**

శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. కొండ పై నుంచి శ్రీవెంకటేశ్వర స్వామిని ముస్తాబు చేసి రథంలో కిందకు తీసుకొచ్చారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భూమారెడ్డి, సహకార సంఘ చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, సర్పంచ్ భగీరథబాయి, ఆలయ కమిటీ చైర్మన్ కేదేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

# ప్రాణం తీసిన నూర్పిడి యంత్రం

- ప్రమాదవశాత్తు వలన కూలీ మృతి

ముథోల్: ఉపాధి నిమిత్తం వచ్చిన కూలీ ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో ఇరుక్కపోయి మృత్యువాత పడిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బెతుల్ జిల్లా మార్పినీ గ్రామానికి చెందిన మనీష్ దుర్వే(23) మండలంలోని వికోలి గ్రామానికి చెందిన ఓ కౌలురైతు పంట పొలంలో శనిగపంట నూర్పిడి చేయడానికి శుక్రవారం ఉదయం వచ్చాడు. మధ్యాహ్న సమయంలో పంటను నూర్పిడి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కపోయి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



శనగ నూర్పిడి యంత్రంలో ఇరుక్కుపోయి మృతి చెందిన మనీష్

## కల్వర్టులో కారు.. తప్పిన ప్రమాదం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్లలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా ఉన్న చిన్న కల్వర్టులో అదుపు తప్పిన ఓ కారు బోల్తా పడింది. మంచిర్యాల నుంచి హాజీపూర్ వైపు వెళ్తున్న కారు శుక్రవారం ఉదయం ఒక్కసారిగా అదుపు తప్పడంతో ఇరుకుగా ఉన్న రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి చిన్న గాయాలు కాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## కలెక్టరేట్ ఎదుట పురుగులమందు తాగిన యువకుడి మృతి

- ఈ నెల 7న ఘటన
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ..



శ్రీనివాస్(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై సుమన్‌భరత్ వివరాల ప్రకారం.. మండలంలోని శంకర్‌నాయక్ తాండకు చెందిన వికలాంగుడు చవాన్ శ్రీనివాస్ (24) ఉద్యోగం కోసం ఆదిలాబాద్ జిల్లాలోని ఎంప్లాయిమెంట్ అధికారి కిరణ్‌కుమారు వద్దకు వెళ్ల రూ.లక్ష ఇస్తే ఉద్యోగం ఇస్తానని తెలిపాడు. దీంతో శ్రీనివాస్ విడతల వారిగా రూ.లక్ష ముట్టచెప్పాడు. అయితే ఉద్యోగం కోసం అడిగితే రేపుమాపు అంటూ దాటవేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట పురుగుల మందుతాగాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రైతు భరోసా దీక్షను విజయవంతం చేయండి

- ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్

నార్నూర్: రైతు సురక్ష సమితి (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉట్నూర్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన రైతు భరోసా దీక్షను విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మారోతి పుష్కర్ కాంప్లెక్స్ వద్ద రైతు భరోసా దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆరోగ్య బీమా, రైతు పింఛన్, రైతు విద్యావికాస్, రైతు జలధార పథకాలు అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న రైతులకు పట్టాలు, బ్యాంకు రుణాలు, రైతుబంధు, పోడు భూములు, గిట్టుబాటు ధర, దళితబస్తీ వంటి పథకాలను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం రైతులు భారీగా తరలివచ్చి రైతు భరోసా దీక్షను విజయవంతం చేయాలని కోరారు. బీసీ నాయకుడు జ్ఞానో బా పుస్కర్, సంఘం ప్రతినిధి ఆరికెళ్లా అశోక్ ఉన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, రైతులు

# తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అశోక్‌నగర్ బస్తీలో తాళం వేసి ఉన్న ఓ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు కన్నం వేశారు. బాధితుడి కథనం ప్రకారం... అశోక్‌నగర్ బస్తీలో నివాసముంటున్న దాసారం ఎల్లయ్య అనే రిటైర్డు ప్రిన్సిపాల్ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బంధువుల పెళ్లికి వెళ్లారు. ఎల్లయ్య కొడుకు తిరుపతి ఇంట్లో ఉండగా గురువారం ఇంటికి తాళం వేసి నైట్ డ్యూటీకి వెళ్లాడు. శుక్రవారం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లో వెళ్లి చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో బిత్తరపోయాడు. బీరువాలోని 5తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి ఆభరణాలు, రూ.10వేల నగదు దోచుకెళ్లారు. వన్‌టౌన్ అదనపు ఎస్సై రాములు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాంనగర్‌లో..

## సార్లు.. జెర స్పందించరూ

జిల్లా కేంద్రంలో కుక్కల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. ప్రతీ కాలనీలో ఇవి గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. రహదారి వెంట వెళ్తున్న వారిపై దాడులకు పా ల్పడి గాయపరుస్తున్నాయి. హైదరాబాద్‌లో తాజాగా ఓ చిన్నారిని వీధి కుక్కలు బలి తీసుకున్న ఘటన నేపథ్యంలో జిల్లాలో సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



రిమ్స్ ఆసుపత్రి వద్ద



న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో